# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 317 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 29 జూలై 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 317 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 29 JULY 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## అసెంబ్లీకి వెళ్లకుంటే రాజీనామా చేయండి

### జగనన్నా.. ఇంత పిరికితనమా? సిగ్గు.. సిగ్గు.. : వైఎస్ షర్మిల ఫైర్

### అసెంబ్లీకి పోనప్పుడు ఆఫ్రికా అడవులకు వెళ్తే ఏంటి? అంటార్కిటికా మంచులోకి వెళ్తే ఏంటి?

- జగన్ మాటలు ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్న షర్మిల
- ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించింది ప్యాలెస్‌లో ప్రెస్‌మీట్లు పెట్టేందుకు కాదని ఆగ్రహం
- ప్రతిపక్ష హోదాకే కాదు.. ఎమ్మెల్యే హోదాకు కూడా జగన్ అర్హులు కాదన్న ఏపీ కాంగ్రెస్ చీఫ్



**అమరావతి పెన్ పవర్** : వైకాపా అధ్యక్షుడు జగన్‌పై ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతానని అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు జగన్‌ను ఉద్దేశించి సోషల్ మీడియాలో షర్మిల పోస్ట్ చేశారు. "సిగ్గు సిగ్గు!! ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని అనడం మీ అజ్ఞానానికి నిదర్శనం. ఇంతకుమించిన పిరికితనం, చేతకానితనం, అహంకారం ఎక్కడా కనబడదు. మోసం చేయడం మీకు కొత్తేమీ కాదు. కానీ.. మిమ్మల్ని ఎన్నుకుని, అసెంబ్లీకి పంపిన ప్రజలను ఇలా వెర్రిగా, వింతగా మోసం చేయడం.. ఓట్లు వేసిన ప్రజలను అవమానించడం మీకే చెల్లింది. అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజాస్వామ్యాన్ని హేళన చేయడం దివాళాకోరుతనం. MLA అంటే Member of Legislative Assembly, not Member of Media Assembly ఎమ్మెల్యేగా గెలిచింది చట్టసభల్లో ప్రజల గొంతుక అవ్వడానికా? మీడియా ముందు సొంత డబ్బా కొట్టుకోవడానికా? ఐదేళ్ల పాలనంతా అవినీతి, దోపిడీ.. రాష్ట్రాన్ని మీరు అప్పుల కుప్ప చేసి పెట్టారని నిండు సభలో అధికార పక్షం శ్వేతపత్రాలు విడుదల చేస్తోంది. మీరు మాత్రం ప్యాలెస్‌లో తాపీగా కూర్చుని మీడియా మీట్‌లు పెడుతున్నారు. ప్రజలు మిమ్మల్ని ఎమ్మెల్యేను చేసింది ఇందుకు కాదు. మీ పాలనపై విమర్శలకు అసెంబ్లీలో ఆన్ రికార్డు సమాధానం ఇచ్చుకునే బాధ్యత మీది కాదా? ప్రజలకు అన్యాయం జరిగితే అధికార పక్షాన్ని ఫ్లోర్ ఆఫ్ ది హౌస్లో ప్రశ్నించే బాధ్యత మీది కాదా?అసెంబ్లీకి పోనని చెప్పే మీరు.. ప్రతిపక్ష హోదాకే కాదు, ఎమ్మెల్యే హోదాకు కూడా అనర్హులు. వెంటనే ఆ పదవికి రాజీనామా చేయండి. బడికి పోను అనే విద్యార్థికి టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తారు. ఆఫీసుకు పోననే పనిదొంగను వెంటనే పనిలోంచి తీసేస్తారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి పోను అంటూ గౌరవ సభను అవమానించిన వాళ్లకు ఎమ్మెల్యేగా ఉండే అర్హత లేదు. ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లనపుడు మీరు ఆఫ్రికా అడవులకు పోతారో.. అంటార్కిటికా మంచులోకే పోతారో ఎవరికి కావాలి? అసెంబ్లీకి పోని జగన్ అండ్ కో తక్షణం ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల పేర్కొన్నారు.

## ధన్యవాదాలు పవన్ అన్న

### ఏపీలో పలు పథకాలకు పేర్లు మార్పు

### చంద్రబాబుకు, లోకేశ్ కు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

### వినమ్రంగా బదులిచ్చిన లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో పలు పథకాలకు కూటమి ప్రభుత్వం పేర్లు మార్చిన సంగతి తెలిసిందే. జగనన్న అమ్మ ఒడి పథకానికి తల్లికి వందనం... జగనన్న విద్యాకానుక పథకానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర... జగనన్న గోరుముద్ద పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం... మన బడి నాడు-నేడు పథకానికి మన బడి- మన భవిష్యత్తు... స్వేచ్ఛ పథకానికి బాలికా రక్ష... జగనన్న ఆణిముత్యాలు పథకానికి అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం అంటూ పేర్లు మార్చారు.

వివరాలు 2లో..

## ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం



**పెన్ పవర్ డెస్క్:** ఎర్ర కాలువ ముంపు వల్ల తూర్పుగోదావరి జిల్లాలో నష్టపోయిన పంట పొలాలను మంత్రుల బృందం పరిశీలించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ

వివరాలు 2లో..

## మరోసారి పెన్షన్ పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు..



**పెన్ పవర్ డెస్క్:**ఏపీకి నాలుగవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు జూలై 1న లబ్ధిదారుల ఇంటికి నేరుగా వెళ్లి పెన్షన్ పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి నగదు పంపిణీ చేసిన మొదటి సీఎంగా నిలిచారు చంద్రబాబు. మరోసారి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ పంచేందుకు సిద్ధమయ్యారు చంద్రబాబు. ఆగస్టు 1న మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్న చంద్రబాబు.. గుండుమలలో పెన్షన్ పంపిణీ చేయనున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆదివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు

వివరాలు 2లో..

## గోదావరి నదిలో గల్లంతైన యువకుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు



- గోదావరి నదిలో కొనసాగుతున్న వరద ఉధృతి
- కోనసీమ జిల్లా గంటిపెదపూడి వద్ద బోటు ప్రమాదం
- నదిలో పడిపోయి విజయ్ అనే యువకుడి గల్లంతు

వివరాలు 2లో..

## బాధ్యతా రాహిత్యమే ఆ మరణాలకు కారణం..

- ఢిల్లీలోని ఓ కోచింగ్ సెంటర్ లోకి పోటెత్తిన వరద
- నీట మునిగి ముగ్గురు అభ్యర్థులు మృతి చెందడంపై రాహుల్ స్పందన
- ఇది వ్యవస్థల వైఫల్యం అని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**ఢిల్లీలో భారీ వర్షాలతో ఓ సివిల్స్ కోచింగ్ సెంటర్ లోకి వరద పోటెత్తి.. ముగ్గురు చనిపోయిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యమే ఈ దారుణానికి కారణమని

వివరాలు 2లో..

## పెద్దిరెడ్డి పీఏ శశికాంత్ నివాసంలో ముగిసిన సోదాలు!

- మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో పోలీసుల విచారణ వేగవంతం
- గతరాత్రి నుంచి హైదరాబాదులోని శశికాంత్ నివాసంలో సోదాలు
- శశికాంత్ నివాసంలో భారీగా ఫైళ్లను గుర్తించిన పోలీసులు!



**పెన్ పవర్ డెస్క్:**మదనపల్లె ఫైళ్ల దగ్ధం వ్యవహారంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. హైదరాబాదులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి పీఏ

వివరాలు 2లో..

## ఇది ఎన్డీయే ప్రభుత్వం... డీఎన్ఏ ప్రభుత్వం కాదు

### విజయసాయిరెడ్డికి హెూంమంత్రి అనిత కౌంటర్

- అనిత, విజయసాయి మధ్య మాటల యుద్ధం
- హత్యలు జరగకుండా చూడడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్న విజయసాయి
- హెూంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- 'శాంతి'-భద్రతల విషయంలో ఎవరు రాజీనామా చేయాలో కాలమే నిర్ణయిస్తుందన్న అనిత



వివరాలు 2లో..

## క్రైస్తవులారా బయటకొచ్చి ఓటు వేయండి..

### ఆ సమస్య పరిష్కారం అవుతుంది

### క్రిస్టియన్లు అంటే ఇష్టమన్న ట్రంప్

### తనకు ఓటు వేస్తే ఆ సమస్య పరిష్కారం అవుతుందని హామీ

### స్పష్టంగా అర్థం కాని ట్రంప్ వ్యాఖ్యల పరమార్థం



**పెన్ పవర్ డెస్క్:**ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం జోరందుకుంది. డెమొక్రాటిక్ పార్టీ నామినీగా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారీస్ ఖరారైన తర్వాత ప్రచార కార్యక్రమాలు మరింత ఊపందుకున్నాయి. ఈ క్రమంలో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి

వివరాలు 2లో..

## మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసు: వైసీపీ మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు నోటీసులు



**పెన్ పవర్ డెస్క్:**మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధమైన ఘటనలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు నోటీసులు జారీ అయ్యాయి. మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా ప్రస్తుతం బెంగళూరులో ఉండడంతో, విచారణ అధికారులు మదనపల్లెలోని ఆయన నివాసంలో నోటీసులు అందించారు. ఇంట్లో నోటీసులు ఇచ్చిన విషయాన్ని బెంగళూరులో ఉన్న నవాజ్ బాషాకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. విచారణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్ లో దగ్ధమైన ఫైళ్లలో చాలావరకు భూములకు సంబంధించినవేనని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భూ అక్రమాలకు సంబంధించిన కుట్ర కోణం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు... డీజీపీ, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ లను అప్రమత్తం చేశారు. వారిని వెంటనే మదనపల్లె వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా కూడా మదనపల్లె వెళ్లి పలు తనిఖీలు చేశారు.

- ఇటీవల మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దగ్ధమైన ఫైళ్లు
- ఇందులో కుట్రకోణం ఉండొచ్చని భావిస్తున్న ప్రభుత్వం
- ప్రస్తుతం బెంగళూరులో ఉన్న నవాజ్ బాషా... ఇంట్లో నోటీసులు అందించిన అధికారులు

# సంపాదకీయం

## కోడి ఈకలతో కోట్ల సంపాదన!

ఓ కాలేజీ స్టూడెంట్. చదువుకునే రోజుల్లో ఒక ఆలోచన వచ్చింది. దాన్ని ఇంప్లిమెంట్ చేస్తే.. ఎంతోమందికి ఉపాధి దొరుకుతుంది. అతనికి లాభాలు వస్తాయి. అంతేనా పర్యావరణానికి మేలు జరుగుతుంది. కానీ.. ఆ ఐడియాని ఆచరణలో పెట్టేందుకు కావాల్సిన వనరులు అతని దగ్గర లేవు. అందుకే తన లక్ష్యాన్ని చేరుకునేందుకు దాదాపు పదేండ్లు ఎదురుచూశాడు. ఎన్నో అడ్డంకులను దాటుకుని చివరికి స్టార్టప్ పెట్టాడు. కట్ చేస్తే.. నాలుగైదేండ్లు కాకముందే ఆ స్టార్టప్? కోట్లలో వ్యాపారం చేసేలా డెవలప్? అయింది. 1200 మంది మహిళలకు ఉపాధి కల్పించడమే కాకుండాఎన్నో నేషనల్, ఇంటర్నేషనల్ అవార్డులు కూడా దక్కాయి. రాధేష్ అగ్రహరికి వచ్చిన ఒక ఐడియా అతనితో పాటు మరెంతోమంది జీవితాలను మార్చేసింది. ఉత్తరప్రదేశ్?లోని ఫతేపూర్‌లో పుట్టి, పెరిగాడు. వాళ్ల ఫ్యామిలీలో ఎక్కువమంది డాక్టర్లే. అందుకే రాధేష్?ని కూడా డాక్టర్? చేయాలి అనుకున్నారు. కానీ.. అతనికి చిన్నప్పటినుంచి డిజైన్ అండ్ క్రాఫ్ట్ మీద మక్కువ ఎక్కువ. దాంతో.. మొహాలిలోని 'టెక్స్‌టైల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ'లో అండర్ గ్రాడ్యుయేషన్ (ఎన్ఐఐఎఫ్?టీ) చేశాడు. తర్వాత 'ఇండియన్? ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్' (ఐఐసీడీ) జైపూర్ నుండి టెక్స్‌టైల్ డిజైనింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. అక్కడినుంచే చికెన్ వ్యర్థాల నుంచి ఫైబర్? తయారుచేసేందుకు ట్రై చేశాడు.
పోస్ట్? గ్రాడ్యుయేషన్?లో రాధేష్? తీసుకున్న కోర్సు చదివే స్టూడెంట్స్ వాళ్లకు నచ్చిన వేస్ట్ మెటీరియల్స్‌పై రీసెర్చ్ చేస్తుంటారు. ఆ కోర్సులో చేరిన మరుసటి రోజు క్లాస్?కి లేట్?గా వెళ్లాడు.అప్పటికే తన క్లాస్‌మేట్స్ అందరూ రీసెర్చ్? కోసం ప్లాస్టిక్, శానిటరీ న్యాప్‌కిన్‌ల నుండి థర్మాకోల్ వరకు అన్ని ఇంపార్టెంట్ టాపిక్స్? సెలక్ట్? చేసుకున్నారు. దాంతో రాధేష్? సెలక్ట్? చేసుకునేందుకు ఏ టాపిక్? మిగల్లేదు. ఏం చేయాలో తోచని పరిస్థితుల్లో బాగా అప్‌సెట్ అయ్యాడు. ఆ మూడ్ నుంచి బయటికి వచ్చేందుకు ఏదైనా రుచికరంగా వండుకుని తినాలి అనుకున్నాడు. వెంటనే పక్కనే ఉన్న చికెన్ సెంటర్‌కు వెళ్లాడు. ఒక కిలో చికెన్ ప్యాక్ చేయమని షాప్ అతనికి చెప్పాడు. కానీ.. అతను ఇచ్చిన ప్యాకెట్ బరువు 650 గ్రాములు మాత్రమే ఉంది. డబ్బు మాత్రం కిలో చికెన్‌కి తీసుకున్నాడు. మిగిలిన 350 గ్రాముల గురించి అడిగితే.. 'అదంతా వేస్ట్' అని సమాధానం ఇచ్చాడు షాపు అతను. ఆ మాటలు విన్న రాధేష్?కి వెంటనే 'ఆ వేస్ట్ నుంచి పనికొచ్చేది ఏదైనా తయారుచేయొచ్చా?' అనే ఆలోచన వచ్చింది. అలా అనిపించడం ఆలస్యం షాప్ అతన్ని 'చికెన్? వేస్ట్‌ని కూడా విడిగా ప్యాక్ చేసి ఇవ్వమ'ని అడిగాడు.

### చికెన్ వేస్ట్‌తో కాలేజీకి

మరుసటి రోజు కాలేజీకి చికెన్? వేస్ట్ బ్యాగ్‌ని పట్టుకుని వెళ్లాడు. ఆ బ్యాగ్? తెరవగానే క్లాస్?రూం అంతా దుర్వాసన వచ్చింది. అంతా ముక్కు మూసుకున్నారు. క్లాస్?మేట్స్? అంతా కలిసి రాధేష్?ను క్లాసు నుంచి బయటికి పంపించారు. కానీ.. లెక్చరర్స్ మాత్రం అతని ఆలోచనను మెచ్చుకున్నారు. 'చికెన్ వేస్ట్‌తో ఏం చేయగలవో ఆలోచించు. ఆ ఐడియా ప్రజెంట్ చెయ్యమని' చెప్పారు. అలా చికెన్ వేస్ట్ మీద రీసెర్చ్ మొదలైంది. ఒక ఐడియా జనరేట్ చేసి, ప్రాసెస్ చేసి, మార్కెట్‌లోకి తెచ్చి సక్సెస్ కావడానికి దాదాపు పదేండ్లకు పైనే పట్టింది. 'కొడితే ఏనుగు కుంభస్థలం మీద కొట్టాలి' అన్నట్టు ఒకేసారి పెద్ద సక్సెస్‌తో ఎందరికో ఆదర్శంగా నిలిచాడు రాధేష్?.

### జర్నీలో ఎన్నో అడ్డంకులు

రాధేష్?కు ఆలోచన వచ్చినప్పటినుంచి కంపెనీ పెట్టేవరకు చాలా అడ్డంకులు ఎదురయ్యాయి. సాధారణంగా 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్'లో బాగా డబ్బున్న వాళ్ల పిల్లలే ఎక్కువగా చేరతారు. వాళ్లంతా డిజైన్, ఫ్యాషన్ గురించి తెలుసుకోవాలి అనుకుంటారు. కానీ.. రాధేష్? వాళ్లందరిలో భిన్నంగా ఆలోచించేవాడు. రాధేష్? తన రీసెర్చ్ కోసం రోజంతా చికెన్ వేస్ట్‌తో పనిచేసేవాడు. అలా చేయడం వల్ల అప్పుడప్పుడు అతని దగ్గర కూడా వాసన వచ్చేది. దాంతో కాలేజీలో చాలామంది అతని దగ్గర నిలబడేందుకు కూడా ఇష్టపడేవాళ్లు కాదు. అవేవీ పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూ పోయేవాడు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తన రీసెర్చ్ మాత్రం ఆపలేదు రాధేష్.

### స్టార్టప్ పెట్టి..

కాలేజీ నుంచి బయటికి వచ్చాక రాధేష్? చాలా రోజులు 'ట్రైఫెడ్ ఇండియా' అనే సంస్థతో కలిసి పనిచేశాడు. అందులో భాగంగా రెండువేల మందికి పైగా గిరిజన మహిళలకు క్రాఫ్ట్స్ ట్రైనింగ్ ఇచ్చాడు. అతనివల్ల పరోక్షంగా కూడా చాలామందికి ఉపాధి దొరికింది. ఆ తర్వాత చికెన్ వేస్ట్ స్టార్టప్ పెడతానంటే.. ముందు వాళ్ల కుటుంబమే ఒప్పుకోలేదు. ఎందుకంటే రాధేష్ ఫ్యామిలీలో దాదాపుగా అందరూ శాఖాహారం తినేవాళ్లే. అందుకే చికెన్ వేస్ట్ బిజినెస్ వద్దన్నారు. అయినా కూడా వాళ్ల మాటలు వినకుండా రంగంలోకి దిగాడు. దానివల్ల కుటుంబీకుల్లో కొందరు కనీసం సాయం చేయడానికి కూడా ముందుకు రాలేదు. దాంతో.. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

### ఇందులోకి ఎందుకు ?

రాధేష్? చికెన్ వేస్ట్‌ని ప్రాజెక్ట్‌గా ఎంచుకోవాడానికి చాలా కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా చికెన్ వేస్ట్ వల్ల చాలా పొల్యూషన్ జరుగుతోంది. అందుకే తనవంతుగా ఏదైనా చేయాలనే ఉద్దేశంతో దీనిమీద రీసెర్చ్ చేశాడు. చికెన్ వేస్ట్ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఉంది. ప్రపంచంలో తడిచెత్తను ఉత్పత్తి చేసే రంగంలో 'మీట్ ఇండస్ట్రీ'ది మూడో స్థానం. నదీ జలాల ప్రధాన కాలుష్య కారణాల్లో చికెన్? వేస్ట్? కూడా ఒకటి. గంగ, యమున లాంటి నదుల్లోని మొత్తం వ్యర్థాల్లో 32.17 శాతం మీట్ వేస్ట్ నుంచి వచ్చేదే. సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ (సీఈఈ) నివేదిక ప్రకారం..
బ్రాయిలర్ మీట్ ప్రొడక్షన్‌లో అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రెజిల్, చైనా తర్వాత మన దేశం ఐదో స్థానంలో ఉంది. మనదేశంలో ఏడాదికి సుమారు 4.6 మిలియన్ మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తి అవుతోంది. దాంతోపాటు కాలుష్యం కూడా బాగానే జరుగుతోంది. అందుకే సీఈఈ ఇలాంటి వేస్ట్ విషయంలో అందరూ శ్రద్ధ తీసుకోవాలని చెప్తోంది. అహ్మదాబాద్ సిటీలోనే రోజుకు దాదాపు 20 టన్నుల చికెన్ వేస్ట్ వస్తోందనేది ఒక అంచనా. అందులో కొంతవరకు అంటే కొన్ని శరీర భాగాలను ప్రాసెస్ చేసి చేపల మేత, ఎరువులుగా వాడుతున్నారు. మిగతాది మునిసిపల్ డంపింగ్ యార్డ్‌లకు చేరుతోంది.

### ఎనిమిదేండ్లకు..

చికెన్ వేస్ట్‌తో ప్రొడక్ట్స్ తయారీ ఆలోచన పుట్టిన దాదాపు పదేండ్లకు అంటే... 2018లో అది కార్యరూపం దాల్చింది. అప్పటివరకు కోడి ఈకలతో బట్టలను ఎవరూ తయారు చేయలేదు. కాబట్టి ఆ బిజినెస్ ఎలా ఉంటుందో తెలియదు. అలా తయారుచేసే పద్ధతుల గురించి ఎక్కడా సమాచారం దొరకలేదు. అయినా.. కొన్నాళ్లు రీసెర్చ్ చేసి కొత్తగా ఒక ప్రాసెసింగ్ పద్ధతిని కనిపెట్టాడు. చివరగా 2018లో 'గోల్డెన్ ఫెదర్స్' అనే యూనిట్ పెట్టాడు. తాను కనిపెట్టిన పద్ధతిలోనే ఈకలను బట్టలుగా మార్చి 2019లో అమ్మకాలు మొదలుపెట్టాడు.

### శాలువాలతో మొదలు

మొదట కబేళాల నుండి వ్యర్థాలను సేకరించి వాటిలో ఉండే పురుగులను చంపడానికి 100 డిగ్రీల టెంపరేచర్‌తో స్టీమ్ చేస్తారు. ఇంకా మిగిలి ఉన్న క్రిములను చంపేందుకు హైజినిక్ పద్ధతుల్లో శానిటైజ్ చేస్తారు. తమదైన పేటెంట్ టెక్నాలజీ, నేచురల్ ఇంగ్రెడియెంట్స్‌ని వాడి కోడి ఈకలను ఉన్ని లాంటి ఒక రకమైన ఫైబర్‌గా ప్రాసెస్ చేస్తారు. ఈకలు చాలా తేలికగా ఉంటాయి. అందుకే ప్రాసెస్ చేస్తే వచ్చే ఫైబర్ పత్తి, జనపనార, ఉన్నికి దగ్గరగా ఉంటుంది.
మృదువుగా, వెచ్చగా, మన్నికగా ఉంటుంది. ఈకలను ఉన్నిలా మార్చేందుకు రాజస్తాన్‌లో 1,200 మంది గిరిజన మహిళలకు ట్రైనింగ్ ఇచ్చాడు. మొదట్లో ఎక్కువగా శాలువాలు తయారుచేశారు. వాటికి గిరాకి బాగా ఉండడంతో మరిన్ని ప్రొడక్ట్స్ తయారుచేశాడు. స్పిన్నింగ్‌కు పనికిరాని ఈకలతో హ్యాండ్ మేడ్ పేపర్, క్విల్ట్, జాకెట్లు, దిండ్ల ఫిల్లర్లు చేస్తున్నారు. మీట్ వేస్ట్‌తో కంపోస్ట్, చేపల మేత తయారవుతోంది.

### కోట్లలో ఆదాయం

ప్రస్తుతం కంపెనీకి జైపూర్, పూణేల్లో యూనిట్లు ఉన్నాయి. బి 2 బి పద్ధతిలో ప్రొడక్ట్స్‌ని అమ్ముతున్నాడు. ఉత్పత్తుల ద్వారా ఏడాదికి 1.5 కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వస్తోంది. ఇప్పటివరకు ఏడు కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. అంతేకాదు.. లాభంలో 25 శాతం వరకు గిరిజన సంక్షేమం, పిల్లల విద్య, ఆరోగ్యం, వరదలు, కరువుల సమయంలో ఆదుకోవడానికి వాడుతున్నాడు. ఇప్పటివరకు 73 లక్షల కిలోల చికెన్ వేస్ట్‌ని ప్రాసెస్ చేశారు. అందుకే రాధేష్ కృషిని మెచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు 25 వరకు వచ్చాయి. అందులో 'జర్మన్ డిజైన్ అవార్డు, లెక్సస్ డిజైన్ అవార్డు, స్వచ్ఛతా స్టార్టప్ అవార్డు' లాంటి ప్రతిష్ఠాత్మకమైనవి కూడా ఉన్నాయి.

### డిజైనర్ నుండి ఇన్నొవేటర్

డిజైనర్ నుండి ఇన్నొవేటర్‌గా మారేవరకు అతని ప్రయాణంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా.. తను నమ్మినదానికోసం పనిచేశాడు. సక్సెస్ అయ్యాడు రాధేష్. మొదట్లో చిన్నగా మొదలైన వ్యాపారం ఇప్పుడు విదేశాలకు ఎక్స్‌పోర్ట్ చేసే స్థాయికి ఎదిగింది. కోడి ఈకలతో చేసిన ప్రొడక్ట్స్‌కి ఇక్కడ కంటే విదేశాల్లో ఎక్కువ డిమాండ్ ఉంది. ఈ ఉత్పత్తులు భారతదేశంలోని వివిధ రిటైల్ దుకాణాలు, గవర్నమెంట్ హ్యాండీ క్రాఫ్ట్ హౌజ్‌లు, ఖాదీ%-%భండార్లు, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్లలో అమ్ముతున్నారు.

### నదులు.. తల్లులు

"ప్రపంచం మొత్తం ప్లాస్టిక్ రీసైక్లింగ్ మీద పని చేస్తోంది. కానీ... చికెన్ వేస్ట్ గురించి ఎవరూ మాట్లాడడం లేదు. నదులను తల్లులుగా పూజించే మన దేశంలో పేగులు, రక్తం, చర్మం, ఈకలతో కూడిన చికెన్ వేస్ట్‌ని నదుల్లో పారేయడం చూసి చాలా బాధేసింది. వాటివల్ల అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం కూడా ఉంది. పెద్ద జంతువుల నుండి వచ్చే వ్యర్థాలను లెదర్‌లాంటివి చేయడానికి, పెట్స్ ఫుడ్‌గా వాడతారు. కానీ.. చికెన్ వేస్ట్‌ని మాత్రం ఎక్కడపడితే అక్కడే పారేస్తున్నారు. దానివల్ల భారీ మొత్తంలో కర్బన ఉద్గారాలు విడుదల అవుతున్నాయి. అందుకే దీనికి ఒక పరిష్కార మార్గం వెతకాలని ప్రయత్నం మొదలుపెట్టా. అందులో భాగంగా పుట్టిందే ఈ ఐడియా" అన్నాడు రాధేష్.

# ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

- మొదటి పేజి తరువాయి
మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌లతో కూడిన మంత్రుల బృందం ఉండ్రాజవరం, నిడదవోలు మండల్లాల్లోని పలు గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించింది. జిల్లా కలెక్టర్ ప్రశాంతి పంట నష్టం వివరాలను మంత్రులకు వివరించారు. తాళ్లపాలెం గ్రామంలో వరద ముంపు వల్ల ఇళ్లలోకి నీరు చేరడంతో నష్టపోయిన బాధితులకు మంత్రులు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.
అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. భారీగా కురిసిన వర్షాలకు ఉభయగోదావరి జిల్లాల్లో పంటలు బాగా నష్టపోయాయని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఎర్ర కాలువ ప్రభావంతో 20 నియోజకవర్గాల్లో రైతులు పంట నష్టపోయారని చెప్పారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్ల కాలువ పూడిక తీయకపోవడం, స్లూయిస్ మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల రైతులకు నష్టం ఏర్పడిందన్నారు. భారీ వర్షాలకు కాలువకు పడిన గండ్లు యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎర్ర కాలువ ముంపు నుంచి రైతులను కాపాడేందుకు ఎంత ఖర్చయినా ఫర్వాలేదని, శాశ్వత వరద నివారణ చర్యలు చేపడతామని మంత్రి స్పష్టం చేశారు.

## ఇది ఎన్డీయే ప్రభుత్వం... డీఎన్ఏ ప్రభుత్వం కాదు

పెన్ పవర్ డెస్క్:ఏపీ హెూంమంత్రి అనిత, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. హెూంమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గడప కూడా దాటడంలేదని విజయసాయి విమర్శించారు. 'బొల్లి' మాటలతో కాలక్షేపం చేయడం వల్లనే రాష్ట్ర భయం గుప్పిట్లోకి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. హత్యలు జరగకుండా చూడడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, అందుకు హెూంమంత్రే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. నైతిక బాధ్యత వహించి హెూంమంత్రి రాజీనామా చేయాలని విజయసాయి డిమాండ్ చేశారు. దీనిపై హెూంమంత్రి అనిత స్పందించారు. 'శాంతి'-భద్రతల విషయాల్లో మీరు రాజీనామా చేయాలో, నేను రాజీనామా చేయాలో కాలమే త్వరలో నిర్ణయిస్తుందని కౌంటర్ ఇచ్చారు. అయినా ఇది డీఎన్ఏ ప్రభుత్వం కాదు... ఇది ఎన్డీయే ప్రభుత్వం... ప్రజలు బాగానే ఉన్నారు... దొంగలే కోటల్లో దాక్కుని ప్రెస్ మీట్లు, ఎక్స్ లో రెట్టలు వేస్తున్నారు అని అనిత విమర్శించారు.

## ధన్యవాదాలు పవన్ అన్న

- మొదటి పేజి తరువాయి
దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. పవన్ చేసిన ట్వీట్ పై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారి అభినందనలు నూతనోత్తేజం నింపాయి. పథకాలకు స్ఫూర్తి ప్రదాతల పేర్లు పెట్టడానికి మీ ఆలోచనలు కూడా ప్రేరణగా నిలిచాయి. ధన్యవాదాలు పవన్ అన్న" అంటూ వినమ్రంగా బదులిచ్చారు.

## మరోసారి పెన్షన్ పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు..

- మొదటి పేజి తరువాయి
మంత్రి సవిత, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, సింధూర రెడ్డి,కందికుంట వెంకటప్రసాద్ తదితరులు హాజరయ్యారు.ఈ క్రమంలో సూపర్ 6అమలుపై ప్రతిపక్ష వైసీపీ ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేయటం ద్వారా విమర్శలకు చెక్ చెప్పనున్నారు.

## క్రైస్తవులారా బయటకొచ్చి ఓటు వేయండి.. ఆ సమస్య పరిష్కారం అవుతుంది

- మొదటి పేజి తరువాయి
డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం క్రిస్టియన్లను ఉద్దేశించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "క్రైస్తవులారా.. ఈసారి కచ్చితంగా బయటకు వచ్చి ఓటు వేయండి. నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ఓటు వేస్తే వచ్చే నాలుగేళ్లలో మళ్లీ ఓటు వేయాల్సిన అవసరం ఉండదు. మరో నాలుగేళ్లలో అది పరిష్కారం అవుతుంది. అదేంటో మీకు తెలుసు. క్రైస్తవులారా మీరంటే నాకెంతో ఇష్టం. నేను కూడా క్రైస్తవుడని. నేను మిమ్మల్ని అభిమానిస్తున్నాను. మీరంతా బయటకు వచ్చి ఓటు వేయండి. ఆ సమస్యను చక్కగా పరిష్కరిద్దాం. అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో 'టర్నింగ్ పాయింట్ యాక్షన్' అనే సంప్రదాయ గ్రూప్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రంప్ ఈ మేరకు మాట్లాడారు.
కాగా ఈ వ్యాఖ్యల ద్వారా ట్రంప్ ఏం చెప్పదలుచుకున్నారో స్పష్టంగా అర్థం కావడంలేదని అమెరికా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ట్రంప్ ప్రచార ప్రతినిధి స్టీవెన్ చియుంగ్ మాట్లాడుతూ.. అమెరికాను ఏకం చేయడం గురించి ట్రంప్ మాట్లాడారని అన్నారు.ట్రంప్ వ్యాఖ్యలకు స్పష్టమైన అర్థం తెలియక పోయినప్పటికీ ఈ వ్యాఖ్యలపై డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇదిలావుంచితే.. గత రెండు ఎన్నికల్లో క్రైస్తవుల ఓట్లు డొనాల్డ్ ట్రంప్‌నకు అనుకూలంగా పడ్డాయి.

## పెద్దిరెడ్డి పీఏ శశికాంత్ నివాసంలో ముగిసిన సోదాలు!

- మొదటి పేజి తరువాయి
శశికాంత్ నివాసంలో సోదాలు ముగిశాయి. ఏపీ పోలీసులు నిన్న రాత్రి నుంచి హైదరాబాదులోని అయ్యప్ప సొసైటీలో ఉన్న శశికాంత్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నారు. పోలీసులు శశికాంత్ నివాసంలో భారీగా ఫైళ్లను గుర్తించారు. పోలీసులు అతడి నివాసం నుంచి నాలుగు పెట్టెల నిండా ఫైళ్లను తరలించినట్టు తెలుస్తోంది. పోలీసులు ఈ సోదాల్లో పలు కీలక పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

## 'ఏ' అంటే అమరావతి.. 'పీ' అంటే పోలవరం



గుంటూరు: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15వేల కోట్లు ఇస్తుందని ఎవరూ ఊహించలేదని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఎంత ఖర్చయినా భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు, మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. " ఏ అంటే అమరావతి.. పీ అంటే పోలవరం. ఈ రెండు నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా తీసుకుంది. కేంద్రం కూడా అందుకు పూర్తి స్థాయిలో సహకరిస్తోంది. అమరావతికి రూ.2500 కోట్లతో రైల్వే లైన్ మంజూరైంది. రూ.12 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల విలువైన అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కూడా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అమోదం తెలిపారు. దీనికి అవసరమైన భూ సేకరణకు కేంద్రం సహకరిస్తోంది.
వెనకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను కూడా కలిసి.. ఆయా జిల్లాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు ఇస్తోంది. రాష్ట్రానికి రెండు మేజర్ పారిశ్రామిక కారిడార్లు రానున్నాయి. వివిధ ప్రాజెక్టుల రూపంలో దాదాపు రూ.80 వేల కోట్ల నిధులు రాష్ట్రానికి వస్తున్నాయి. కేంద్ర పథకాల ద్వారా మరిన్ని నిధులు వస్తాయి" అని పెమ్మసాని తెలిపారు.

## బాధ్యతా రాహిత్యమే ఆ మరణాలకు కారణం..

- మొదటి పేజి తరువాయి
ఆయన పేర్కొన్నారు. పేలవమైన భవన నిర్మాణ ప్రణాళిక, భద్రత లేని నిర్మాణం వల్ల సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. మృతి చెందిన ముగ్గురు అభ్యర్థుల కుటుంబాలకు రాహుల్ సానుభూతి తెలిపారు. దీనిపై తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

### సురక్షితంగా జీవించడం అందరి హక్కు

'ఢిల్లీలోని ఓ భవనం బేస్ మెంట్‌లోకి వరద నీరు చేరి.. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం దురదృష్టకరం. కొన్ని రోజుల క్రితం వర్షాల వల్ల కరెంట్ షాక్ కు గురై ఒక విద్యార్థి మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యమే. సంస్థల బాధ్యతా రాహిత్యం వల్ల సాధారణ ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సురక్షితంగా జీవించడం దేశంలోని ప్రతీ పౌరుడి హక్కు. దాన్ని అందించడం ప్రభుత్వాల బాధ్యత' అని రాహుల్ పేర్కొన్నారు.

## ఒలింపిక్స్‌లో షూటర్ల హవా.. ఫైనల్లో అర్జున్ బాబుటా



పారిస్ ఒలింపిక్స్‌లో భారత షూటర్లు ఔరా అనిపిస్తున్నారు. తొలి రోజు నిరాశపరిచినా.. రెండో రోజు పతకాలపై ఆశలు రేకెత్తిస్తున్నారు. ఆదివారం(జులై 28) జరిగిన మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ విభాగంలో మను భాకర్ కాంస్య పతకం సాధించి దేశానికి తొలి పథకాన్ని అందించింది. మరోవైపు, ఇదే విభాగంలో భారత మహిళా షూటర్ రమితా జిందాల్ ఫైనల్‌కు అర్హత సాధించింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో రమితా 631.5 పాయింట్లు సాధించి 5వ స్థానంలో నిలిచింది. తాజాగా, పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో అర్జున్ బాబుటా ఫైనల్ చేరాడు. అతను 630.1 స్కోరుతో 7వ స్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో పోటీ పడిన మరో షూటర్ సందీప్ సింగ్ 12వ స్థానంలో నిలిచాడు. పురుషుల 10మీ ఎయిర్ పిస్టల్ ఫైనల్ సోమవారం జరగనుంది.

## శ్రీశైలానికి భారీ వరద.. గేట్లు తెరిచేందుకు అధికారుల సన్నద్ధం



కర్నూలు: శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం చేరుతోంది.
జలాశయానికి ప్రస్తుతం జూరాల నుంచి దాదాపు 3లక్షల క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 1.40లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కుడిగట్టు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి 60,977 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 872.60 అడుగులకు చేరింది. అల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయి నీటిమట్టం ఉండటంతో ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. మరో వైపు తుంగభద్ర, సుంకేశుల జలాశయాలు కూడా నిండిపోవడంతో అటువైపు నుంచి కూడా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. మరో 13 అడుగుల మేర నీటిమట్టం పెరిగితే శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయికి చేరుకుంటుంది. దీంతో ఈనెల 30న శ్రీశైలం గేట్లు తెరిచేందుకు ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

## గోదావరి నదిలో గల్లంతైన యువకుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:కోనసీమ జిల్లాలో జరిగిన బోటు ప్రమాదంలో విజయ్ అనే యువకుడు గోదావరిలో గల్లంతయ్యాడు. విజయ్ స్వస్థలం పి.గన్నవరం గ్రామం. గంటిపెదపూడి వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తుండగా, ఈ బోటు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గోదావరిలో గల్లంతైన యువకుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం ప్రకటించారు. గోదావరి నదిలో వరద ఉద్ధృతి తగ్గేంతవరకు లంక గ్రామాల ప్రజలు, గోదావరి పరీవాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## ఒక్క సెకనులో 2 లక్షల సినిమాలు డౌన్ లోడ్..

# ప్రపంచంలోనే హైస్పీడ్ ఇంటర్నెట్

### ఏకంగా సెకనుకు 402 టెరాబిట్ల డేటా ట్రాన్స్ ఫర్

### కొత్త సాంకేతికతను రూపొందించిన ఆస్టన్ వర్సిటీ శాస్త్రవేత్తలు

### ఇప్పుడున్న ఫైబర్ ఆప్టిక్ కేబుల్లతోనే డేటా ప్రసారం



మీరు వాడే నెట్ స్పీడ్ ఎంత? మొబైల్ లో అయితే 4జీ, 5జీతో 100 ఎంబీపీఎస్ వరకు వస్తుంది. ఇంట్లో పెట్టుకునే బ్రాండ్ బ్యాండ్ ఇంటర్నెట్ స్పీడ్ ఒక జీబీపీఎస్ వరకు ఉంటుంది. కానీ ఏకంగా 400 టీబీలకుపైగా ఇంటర్నెట్ స్పీడ్ తెలుసా? అంటే సెకనుకు 4 లక్షల జీబీపీఎస్ స్పీడ్ అన్నమాట. యూకేలోని ఆస్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఇంత స్పీడ్ ఇంటర్నెట్ ను సాధించగలిగారు.

**వేర్వేరు వేవ్ లెంత్ లను వినియోగించి..**

సాధారణంగా ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లలో నిర్ణీత వేవ్ లెంత్ ఉన్న కాంతిని ఉపయోగించి సమాచారాన్ని ప్రసారం చేస్తారు. కాంతి ద్వారానే డేటా ట్రాన్స్ ఫర్ అవుతుంది. అయితే ఒకే వేవ్ లెంత్ ఉన్న కాంతిని మాత్రమేకాకుండా.. వేర్వేరు వేవ్ లెంత్ లు ఉన్న కాంతిని ఒకే సమయంలో ఉపయోగించడం ద్వారా శాస్త్రవేత్తలు హైస్పీడ్ ఇంటర్నెట్ ను సాధించగలిగారు.

ఈ టెక్నాలజీకి జపాన్ శాస్త్రవేత్తలు అనుసరించిన విధానమే మూలం. కొన్నేళ్లుగా దీనిపై పరిశోధనలు చేస్తున్న జపాన్ శాస్త్రవేత్తలు కొన్ని నెలల కింద ఏకంగా 301 టీబీపీఎస్ స్పీడ్ తో డేటాను ప్రసారం చేయగలిగారు.

ఇప్పుడు అదే తరహా టెక్నాలజీని మరింత మెరుగుపర్చి ఏకంగా 402 టీబీపీఎస్ స్పీడ్ సాధించినట్టు ఆస్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్త ఇయాన్ ఫిలిప్స్ వెల్లడించారు.

**ఇప్పుడున్న కేబుల్స్ తోనే ఆ స్థాయి స్పీడ్..**


ఆస్టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఇప్పుడు మార్కెట్లో అందుబాటులో ఉన్న ఫైబర్ ఆప్టిక్ కేబుళ్ల ద్వారానే 402 టీబీపీఎస్ వేగం సాధించగలిగారు. అంటే కొత్తగా కేబుళ్లను మార్చాల్సిన అవసరం ఉండదు. కేవలం డేటాను ప్రసారం చేసే చోట, రిసీవ్ చేసుకునే చోట చిన్నపాటి పరికరాలు, యాంప్లిఫయర్లను వాడితే చాలని శాస్త్రవేత్త ఇయాన్ ఫిలిప్స్ వెల్లడించారు. త్వరలోనే ఈ టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

## ఇది హిస్టారికల్ మెడల్... పారిస్ ఒలింపిక్స్ లో మను బాకర్ ఘనతపై ప్రధాని మోదీ స్పందన

### పారిస్ ఒలింపిక్స్ లో భారత్ బోణీ

### 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ అంశంలో మను బాకర్ కు కాంస్యం

### అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ



పారిస్ ఒలింపిక్స్ లో భారత్ కు తొలి పతకం లభించింది. అది కూడా చరిత్రలో నిలిచిపోయేలా పతకం దక్కింది. మహిళా షూటర్ మను బాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ అంశంలో కాంస్యం సాధించింది. ఇప్పటివరకు ఒలింపిక్ మహిళల షూటింగ్ అంశంలో భారత్ కు లభించిన తొలి పతకం ఇదే. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. మను బాకర్ సాధించిన కాంస్యం చారిత్రాత్మకమైన పతకం అని అభివర్ణించారు. "పారిస్ ఒలింపిక్స్ లో మొట్టమొదటి పతకం అందించావు... వెల్ డన్ మను బాకర్. కాంస్యం గెలిచినందుకు కంగ్రాచ్యులేషన్స్. ఈ పతకం ఎంతో ప్రత్యేకం... ఎందుకంటే ఒలింపిక్స్ లో ఇప్పటివరకు భారత్ కు షూటింగ్ కేటగిరిలో పతకం అందించిన తొలి మహిళగా మను బాకర్ అవతరించింది... నిజంగా ఇది అద్భుతమైన ఘనత" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

## ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు



ఈ నెల 29 నుంచి 31 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ అధికారులు ప్రకటించారు. దౌండ్ సెక్టార్లో ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్నందున సెంట్రల్ రైల్వే పలు రైళ్లను మూడు రోజుల పాటు రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఈ డివిజన్ లో మొత్తం 62 రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు వివరించారు. ఇందులో సికింద్రాబాద్ డివిజన్ కు సంబంధించి జూన్ 29న పుణే-సికింద్రాబాద్ (ట్రైన్ నెం.12025), జులై 30న సికింద్రాబాద్-లోకమాన్య తిలక్ టెర్మినస్ (ట్రైన్ నెం.1220) దౌండ్-నిజామాబాద్ (ట్రైన్ నెం.11409) రైళ్లను రద్దు చేశారు.

## పులివర్తి నానిపై హత్యాయత్నం కేసు.. వైసీపీ నేత మోహిత్‌రెడ్డిని విడిచిపెట్టిన పోలీసులు

### చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో 37వ నిందితుడిగా మోహిత్‌రెడ్డి

### బెంగళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

### విచారణ అనంతరం 41ఏ నోటీసులు ఇచ్చి విడుదల



టీడీపీ నేత, ఎమ్మెల్యే పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని పోలీసులు విడిచిపెట్టారు. దుబాయ్ వెళ్లేందుకు బెంగళూరు చేరుకున్న మోహిత్‌రెడ్డిని గత రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి ఈ ఉదయం తిరుపతిలోని ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ ఆయనను విచారించిన అనంతరం 41ఏ నోటీసులు ఇచ్చి వదిలిపెట్టారు. విదేశాలకు వెళ్లకూడదని షరతులు విధించారు.

ఏపీలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రగిరి నుంచి పులివర్తి నాని పోటీ చేయగా, ప్రత్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బరిలోకి దిగారు. పోలింగ్ అనంతరం తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూం పరిశీలనకు వెళ్తున్న క్రమంలో పులివర్తి నానిపై దాడి జరిగింది. ఈ నేపథ్యంలో మోహిత్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసులో మోహిత్‌రెడ్డి 37వ నిందితుడిగా ఉన్నారు.

## తెలుగు ఫిలిం ఛాంబర్ కు కొత్త అధ్యక్షుడు వచ్చాడు!

### ముగిసిన దిల్ రాజు పదవీకాలం

### తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్ష పదవికి ఎన్నికలు

### ఫిలిం ఛాంబర్ నూతన అధ్యక్షుడిగా భరత్ భూషణ్ ఎన్నిక

### ఉపాధ్యక్షుడిగా నిర్మాత అశోక్ కుమార్ ఎన్నిక



తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్ సీసీ) అధ్యక్షుడిగా దిల్ రాజు పదవీకాలం ముగియడంతో నేడు (జులై 28) ఎన్నికలు నిర్వహించారు. నిర్మాతలు, స్టూడియోల యజమానులు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. విశాఖకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ భరత్ భూషణ్ తెలుగు ఫిలిం ఛాంబర్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈసారి ఫిలిం ఛాంబర్ అధ్యక్ష పదవికి డిస్ట్రిబ్యూటర్లు పోటీలో నిలిచారు. భరత్ భూషణ్, ఠాగూర్ మధు (నెల్లూరు) పోటీపడగా, భరత్ భూషణ్ నే విజయం వరించింది. భరత్ భూషణ్ కు 29 ఓట్లు, ఠాగూర్ మధుకు 17 ఓట్లు వచ్చాయి. ఇక, తెలుగు ఫిలిం చాంబర్ ఉపాధ్యక్ష పదవికి కూడా నేడు ఎన్నికలు నిర్వహించగా... నిర్మాత అశోక్ కుమార్ గెలిచారు. ఉపాధ్యక్ష పదవికి అశోక్ కుమార్, వైవీఎస్ చౌదరి మధ్య పోటీ జరిగింది. అశోక్ కుమార్ కు 28 ఓట్లు, వైవీఎస్ చౌదరికి 18 ఓట్లు లభించాయి.

## ఫుట్‌బాల్ స్టేడియంపైకి హెజ్బొల్లా రాకెట్ దాడి.. 12 మంది చిన్నారుల మృతి..

### ఇజ్రాయెల్-హమాస్ మధ్య కొనసాగుతున్న యుద్ధం

### హమాస్‌కు మద్దతుగా బరిలోకి హెజ్బొల్లా

### మూల్యం చెల్లించుకోక తప్పదని ఇజ్రాయెల్ హెచ్చరిక

### తమకు సంబంధం లేదన్నహెజ్బొల్లా



ఇజ్రాయెల్ ఆక్రమిత గోలన్ హైట్స్‌లోని ఓ ఫుట్‌బాల్ గ్రౌండ్‌పై జరిగిన రాకెట్ దాడిలో చిన్నారులు సహా 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇది ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా పనేనని ఇజ్రాయెల్ ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను హెజ్బొల్లా కొట్టిపారేసింది. హమాస్‌పై దాడి తర్వాత ఇరాన్ మద్దతు కలిగిన లెబనీస్ గ్రూప్ అయిన హెజ్బొల్లా ఇజ్రాయెల్‌పై తరచూ దాడులకు దిగుతోంది. తాజా దాడితో ఇజ్రాయెల్, గాజా మధ్య మరోమారు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రస్తుతం రాకెట్ దాడి జరిగిన ప్రాంతం సిరియాలో ఉండేది. 1967లో దీనిని ఇజ్రాయెల్ ఆక్రమించింది. తాజా దాడిపై ఇజ్రాయెల్ తీవ్రంగా స్పందించింది. హెజ్బొల్లా దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. దీనిపై స్పందించిన హెజ్బొల్లా ఆ దాడితో తమకు ఎలాంటి సంబంధమూ లేదని పేర్కొంది. ఇజ్రాయెల్ ఆరోపణలను ఖండిస్తున్నట్టు తెలిపింది.

## రూమ్మేట్‌ను కత్తితో పొడిచి చంపిన యువకుడు

### హైదరాబాద్ ఎస్సార్‌నగర్‌లో దారుణం

### మద్యం తాగి నిత్యం రాత్రి రూముకు వస్తుండడంతో వాగ్వివాదం

### కోపంతో విచక్షణ రహితంగా కత్తితో దాడి

### అక్కడికక్కడే మృతి చెందిన యువకుడు

హైదరాబాద్‌లోని ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. బార్బర్ షాప్‌లో ఉపయోగించే కత్తితో స్నేహితుడిపై దాడిచేసి చంపేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేసే వెంకటరమణ, బార్బర్ షాప్‌లో పనిచేసే గణేశ్ కలిసి ఒకే రూములో ఉంటున్నారు. గణేశ్‌కు మద్యం తాగే అలవాటు ఉండడంతో నిత్యం రాత్రి మద్యం తాగి రూముకు వచ్చేవాడు. దీంతో తనకు నిద్రాభంగమవుతోందని, తాగి రూముకు రావొద్దని గణేశ్‌ను వెంకటరమణ పలుమార్లు హెచ్చరించాడు. అయినప్పటికీ అతడి తీరు మారలేదు. గత అర్ధరాత్రి మరోమారు తాగి రావడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. అది కాస్తా ముదరడంతో కోపంతో ఊగిపోయిన గణేశ్ సెలూన్‌లో ఉపయోగించే కత్తితో వెంకటరమణను విచక్షణ రహితంగా పొడిచాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరమణది కర్నూలు జిల్లా ఆలమూరని పోలీసులు తెలిపారు.

## బస్సు నుంచి రూ. 3 కోట్ల విలువైన బంగారు నగల చోరీ

### హైదరాబాద్ నుంచి ముంబై బయలుదేరిన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు

### అర్ధరాత్రి సంగారెడ్డి జిల్లా సత్వార్ వద్ద ఆగిన బస్సు

### ప్రయాణికుల్లా బస్సెక్కి బ్యాగుతో పరారైన దొంగలు



హైదరాబాద్ నుంచి ముంబై వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో రూ. 3 కోట్ల విలువైన బంగారు ఆభరణాలున్న బ్యాగు చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి ముంబైకి బయలుదేరింది. అదే బస్సులో బంగారు నగల వ్యాపారి ఆశిష్ (32) నాలుగు కేజీల నగలతో ముంబైకి వెళ్తున్నాడు. బస్సు అర్ధరాత్రి సత్వార్ వద్ద కోహినూర్ దాబా వద్ద ఆగింది. ప్రయాణికులందరూ దిగారు. సిగరెట్ తాగేందుకు ఆశిష్ కిందికి దిగాడు. తిరిగి బస్సెక్కి చూస్తే ఆభరణాలున్న సంచి కనిపించకపోవడంతో లబోదిబోమన్నాడు. దొంగలు ప్రయాణికుల్లా బస్సెక్కడం, ఆ తర్వాత బ్యాగుతో వెళ్లడం దాబా వదనున్న సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది. చోరీపై అనుమానా లు.. పొంతనలేని వ్యాపారి సమాధానాలు

దాదాపు రూ. 3 కోట్ల విలువైన నగలున్న బ్యాగ్ పోగొట్టుకున్న వ్యాపారి ఫిర్యాదు సమయంలో తడబాటుకు గురికావడంపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు కిలోల ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఒకసారి, మొత్తం బ్యాగునే ఎత్తుకెళ్లారని మరోసారి వ్యాపారి చెప్పినట్టు పోలీసులు తెలిపారు. ఆ నగలకు సంబంధించిన పూర్తి బిల్లు కావాలని కోరడంతో వ్యాపారి హైదరాబాద్ వెళ్లినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, 2019లో ఇదే దాబా వద్ద ఇలానే ఓ వ్యాపారి నుంచి రూ. 1.50 కోట్ల నగదు చోరీ అయింది.

# కోచ్ గౌతమ్ గంభీర్‌పై రియాన్ పరాగ్ ప్రశంసలు

**విభిన్న పరిస్థితులకు అనుగుణంగా సిద్ధం చేశాడన్న యువ క్రికెటర్**

**కేవలం 1.2 ఓవర్లలో 3 వికెట్లు తీసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆల్ రౌండర్**

**శ్రీలంకపై మొదటి టీ20 మ్యాచ్ అనంతరం ఆసక్తికర వ్యాఖ్యలు**




కోచ్ గౌతమ్ గంభీర్ పర్యవేక్షణలో శనివారం రాత్రి భారత్ తొలి విజయం సాధించింది. పల్లెకెలె వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 43 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఒకానొక స్థితిలో శ్రీలంక పటిష్టమైన స్థితిలో నిలిచింది. మ్యాచ్ చేజారుతున్న సమయంలో భారత అద్భుతంగా తిరిగి పుంజుకున్నారు. ముఖ్యంగా యువ ఆల్ రౌండర్ సంచలన బౌలింగ్ చేశాడు. క్లిష్ట పరిస్థితుల్లో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ బంతిని అందించగా రియాన్ పరాగ్ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. రియాన్ పరాగ్ చెలరేగాడు. కేవలం 1.2 ఓవర్లు వేసి కేవలం 5 పరుగులు ఇచ్చి 3 ముఖ్యమైన వికెట్లు తీశాడు. ముఖ్యమైన క్మిందు మెండిస్, మహేశ్ తీక్షణ, దిల్షాన్ మధుశంక వికెట్లను తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. దీంతో తొలి వికెట్‌కు 84 చక్కటి ఆరంభాన్ని అందుకున్న శ్రీలంక 170 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో భారత్ జయకేతనం ఎగురవేసింది. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన రియాన్ పరాగ్ మ్యాచ్ అనంతరం ఆసక్తికరమైన విషయాలను వెల్లడించాడు. విభిన్న పరిస్థితులకు అనుగుణంగా ఏ విధంగా సిద్ధంగా కోచ్ గౌతమ్ గంభీర్ చెప్పాడని పేర్కొన్నారు. తనకు బౌలింగ్ అంటే చాలా ఇష్టమని, నెట్స్‌లో వీలైనంత ఎక్కువగా బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తుంటానని పరాగ్ వెల్లడించాడు. ఎక్కడ బౌలింగ్ చేయాలి,

ఎలా బౌలింగ్ చేయాలనే అంశాలపై నెట్స్‌లో చాలా చర్చలు జరిగేవని, గౌతమ్ సర్ కూడా తనతో అలాంటి కసరత్తులు చేయించారని వివరించాడు. బంతి స్పిన్ అవుతున్నప్పుడు 16వ, 17వ ఓవర్లలో బౌలింగ్ చేయాల్సి వస్తే తాను ఏం చేయాలో గంభీర్ చెప్పినట్టు వివరించాడు. స్టంప్స్‌కు బౌలింగ్ చేయడమే తన పనని, బంతి కూడా టర్న్ అయిందని రియాన్ పరాగ్ వివరించాడు.

ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో షేర్ చేసింది. రియాన్ పరాగ్‌తో పాటు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ఆ వీడియోలో మాట్లాడుకున్నారు.

# పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ బోణీ.. కాంస్యం సాధించిన షూటర్ మను భాకర్

పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత్ పతకాల బోణీ కొట్టింది. భారత షూటర్ మను భాకర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుని చరిత్ర సృష్టించింది. 221.7 పాయింట్లతో మను భాకర్ మూడవ స్థానంలో నిలవగా.. దక్షిణకొరియాకు చెందిన వైజే ఓహ్ 243.2 పాయింట్లతో స్వర్ణం గెలుచుకుంది. తన దేశానికి వైజే కిమ్ 241.3 పాయింట్లతో రజతం గెలుచుకుంది. టైటిల్ పోరులో మను భాకర్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. దీంతో ఆమె చరిత్ర సృష్టించింది. ఒలింపిక్స్‌లో షూటింగ్ కేటగిరిలో పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె నిలిచింది. అందులోనూ భారత్ అందుకున్న తొలి పతకం కావడంతో ఆమె పేరు మార్మోగుతోంది. భారత్ చివరిసారిగా 2012 లండన్ ఒలింపిక్స్‌లో షూటింగ్‌లో పతకాన్ని గెలిచింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో గగన్ నారంగ్ కాంస్యం, పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో విజయ్ కుమార్ రజతం సాధించారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే భారత్ పతకం గెలిచింది. ఇక పారిస్ ఒలింపిక్స్ రెండవ రోజున మరికొందరు అథ్లెట్లు అదరగొట్టారు. పతకాలపై ఆశలు రేపారు. అర్జున్ బాబుటా పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. రమితా జిందాల్ కూడా కూడా




మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. వీరిద్దరూ పతకాలపై ఆశలు పెంచుతున్నారు. ఇక భారత రోయర్ బల్‌రాజ్ పురుషుల సింగిల్ స్కల్స్‌లో రెండవ స్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాడు.

# అదరహో రమిత.. పారిస్ ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఉమెన్స్ ఎయిర్ రైఫిల్‌లో ఫైనల్లో అడుగు

**631.5 పాయింట్లతో 5వ స్థానంలో నిలిచిన రమిత**

**రేపు జరగనున్న ఫైనల్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్న భారత అథ్లెట్**

**తృటిలో అర్హత కోల్పోయిన ఎలవెనిల్ వలరివన్**

పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా భారత షూటర్లు వేటకొనసాగిస్తున్నారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో రమితా జిందాల్ ఫైనల్‌కు అర్హత సాధించింది. 631.5 స్కోరుతో ఐదో స్థానంలో నిలిచి అర్హత సాధించింది. 104.3, 106.0, 104.9, 105.3, 105.3, 105.7 చొప్పున స్కోర్లు సాధించింది. 2022లో హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో రమితా జిందాల్ అదరగొట్టింది. రెండు పతకాలు సాధించిన ఆమె ప్రస్తుత ఒలింపిక్స్‌లో పతకంపై ఆశలు రేపింది. కాగా ఇదే ఈవెంట్‌లో భారత్‌కే చెందిన ఎలవెనిల్ వలరివన్ తృటిలో ఫైనల్ అవకాశాన్ని చేజార్చుకుంది. అతి తక్కువ తేడాతో ఆమె ఫైనల్ ఛాన్స్‌ను కోల్పోయింది. 630.7 స్కోర్‌తో 10వ స్థానానికి పరిమితమైంది. తొలి 8 స్థానాల్లో నిలిచిన షూటర్లు రేపు (సోమవారం) జరిగే ఫైనల్‌లో పోటీపడతారు.

కాగా శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రమితా జిందాల్, వలరివాన్ ఇద్దర విఫలమయ్యారు. అయితే ఈ రోజు జరిగిన వ్యక్తిగత ఈవెంట్‌లో ఇద్దరూ చక్కటి ప్రతిభ కనబరచడం విశేషం.



**డిజైనర్ డ్రెస్‌లో కరిష్మా తన్నా అబ్బురపరిచే క్లిక్‌లు**



# సామ్ బ్రేక్.. ఎంత ఆదాయం పోతుందో తెలుసా?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి తెలియనివారు ఎవరూ ఉండరేమో. ఆమె దాదాపు దశాబ్దానికి పైగా సినిమాలు చేస్తూ, దక్షిణాది ప్రజలను అలరిస్తూ వస్తున్నారు. ఆమెకు రోజు రోజుకీ క్రేజ్ పెరుగుతుందే కానీ, తగ్గుతున్నది లేదు. ముఖ్యంగా, ది ఫ్యామిలీ మ్యాన్ వెబ్‌సిరీస్‌లో తన నటనతో జాతీయ దృష్టిని ఆకర్షించినప్పటి నుండి సమంత క్రేజ్ రోజు రోజుకీ పెరిగిపోతోంది.అయితే, ఆమె తన అనారోగ్య కారణాల వల్ల సంవత్సరం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. చాలా మంది దర్శక నిర్మాతలు ఆమెతో సినిమాలు చేయాలని ఉత్సాహం చూపిస్తున్నా కూడా ఆమె మాత్రం సినిమాలు చేయడానికి అస్సలు సముఖతగా లేరు. ఆమె తన ఆరోగ్యం పూర్తిగా సెట్ అయ్యే వరకు మళ్లీ ఎలాంటి సినిమా చేయాలని అనుకోవడం లేదు. అయితే, ఈ బ్రేక్ కి ముందు సమంత తన పారితోషకం పెంచేసింది. ఫ్యామిలీ మ్యాన్ 2 తర్వాత ఆమె తన రెమ్యూనరేషన్ ని రూ.10 కోట్లకు పెంచేసింది. ఆమె చివరగా ఖుషీ, సిటాడెల్ ల కోసం రూ.5 కోట్లు తీసుకుంది. అయితే, తాను ప్రస్తుతం సంవత్సరం పాటు బ్రేక్ తీసుకోవడంతో దాదాపు సమంత రూ30కోట్లు నష్టపోవాల్సి రావడం గమనార్హం.

చేతిలో ఉన్న సినిమాలను వదులుకోవడంతో పాటు, ఆమె చేతిలో ఉన్న బ్రాండ్స్ కి కూడా దూరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో, సమంత కేవలం ఒక్క సంవత్సరం గ్యాప్ తీసుకోవడం వల్ల రూ.30కోట్ల నష్టం వాటిల్లుతోందని తెలిసి ఫ్యాన్స్ షాకౌతున్నారు, అయితే, ఆమె ఆరోగ్యం కంటే, ఈ డబ్బు ఎక్కువ కాదు అని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, సమంత మూవీలకు బ్రేక్ ఇచ్చినా, ఆమె క్రేజ్ మాత్రం బాగా పెరిగింది. ఓర్మాక్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో సమంత ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఆమె అగ్ర తారలను వెనక్కి నెట్టి, మొదటి స్థానంలోకి చేరడం విశేషం. దేశంలోని స్టార్ల టాప్ ర్యాంకింగ్స్ ఇక్కడ ఉన్నాయి. వరుసగా సమంత (1) అలియా భట్ (2), దీపికా పదుకొణె (3), నయనతార (4), కాజల్ అగర్వాల్ (5) ఉన్నారు. టాప్ 10 జాబితాలో త్రిష (6), కత్రినా కైఫ్ (7), కియారా అద్వానీ (8), కీర్తి సురేష్ (9), రష్మిక మందన్న (10) చోటు దక్కించుకోవడం విశేషం.



**నీలి రంగులో నికితా దత్తా యొక్క ట్రెండీ ఫోటోషూట్**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com